సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



చకచకా అడుగులు

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ వేగం అందుకుంది. భూసేకరణ అధికారిగా నర్సీపట్నం ఆర్డీవోను నియమించారు. IIలో



విచారణ ప్రక్రియపై శిక్షణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో విచారణ ప్రక్రియలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.



వైద్య పరీక్షలు

విశాఖ: ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో గురువారం కేజీహెచ్ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

బీఎల్‌ఏలను నియమించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: రాజకీయ పార్టీలు జిల్లాలో అన్ని వార్డులకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. కలెక్టరేట్ డీఆర్వో కార్యాలయంలో ఓటర్ల జాబితా తయారీపై గురువారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఇప్పటికే ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు కార్యక్రమం చేపట్టారని అన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాతవరంలో నేటి 'స్పందన'కు సర్వం సిద్ధం

- సమీప ప్రాంత ప్రజలకు మంచి అవకాశం

నాతవరం: మండల కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి నేతృత్వంలో జిల్లా అధికారులు పాల్గొనే 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ఆయన గురువారం ఎంపీడీవో హనుమంతరావు, ఇతర శాఖల అధికారులతో కలిసి వెలుగు కార్యాలయంలో స్పందన ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి శాఖల వారీగా సంబంధిత అధికారులను ఆదేశించేందుకు వీలుగా వసతి ఏర్పాటు చేశారు. అర్జీదారులు దరఖాస్తులు ఇచ్చి వెళ్లేందుకు రెండు ద్వారాలు సమకూర్చారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఫిర్యాదులు నమోదు చేసి రశీదులు ఇవ్వడానికి ప్రత్యేకంగా అయిదు కంప్యూటర్లు సిద్ధం చేశారు. 'స్పందన'కు వచ్చే ప్రజలు వేచి ఉండేందుకు కార్యాలయాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. మండల కేంద్రంలో స్పందన కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటిసారని, సమీప ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు కోరారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



రాంబాబును సత్కరిస్తున్న ఆర్జేడీ కృష్ణారెడ్డి, చిరికి శ్రీనివాసరావు

దేవరాపల్లి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొట్టాన రాంబాబు మాస్టారును ఘనంగా సత్కరించారు. దేవరాపల్లి మండలం కాశీపురం జెడ్పీ హైస్కూల్లో సాంఘిక శాస్త్ర సహోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాంబాబు గురుపూజోత్సవం రోజున రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ రాయలసీమ ప్రాంత ఆర్జేడీ, గతంలో ఉమ్మడి విశాఖ డీఈవోగా పనిచేసిన కృష్ణారెడ్డి, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు తదితరులు బుధవారం రాత్రి విశాఖలో మెమెంటో అందజేసి, రాంబాబు మాస్టారిని శాలువాతో సత్కరించారు. దేవరాపల్లి మండల ఉపాధ్యాయులు ఆదిరెడ్డి ఈశ్వరరావు, సతీష్, కొమ్మినేని సన్యాసినాయుడు అభినందించారు.


హోంగార్డుల ఉదారత



హోంగార్డు భార్య హైమకు చెక్కు అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన హోంగార్డు ఆదారి కుమారస్వామి కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులు ఒకరోజు వేతనాన్ని ఆర్థిక సాయంగా అందించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం హోంగార్డు భార్య హైమకు రూ.3,94,050 చెక్కును ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అందజేశారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు. సహచర హోంగార్డుల ఉదారతను ఎస్పీ అభినందించారు.

ఖరీఫ్ సాగునీటికి ఢోకా లేనట్టే..




నీటితో నిండిన రైవాడ జలాశయం



కల్యాణపులోవ రిజర్వాయరులో జల కళ

- జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టాలు
- పెద్దేరు గేట్లు ఎత్తి నదిలోకి నీరు విడుదల
- భారీ వర్షాలతో కొద్ది రోజుల్లోనే మారిన పరిస్థితి



పెద్దేరు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్న దృశ్యం



పెద్దేరు ఆయకట్టులో నీటితో పచ్చని వరి చేలు

చోడవరం/మాడుగుల/దేవరాపల్లి: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో జలాశయాల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో అడుగంటి ఉన్న రిజర్వాయర్ల నీటిమట్టాలు ఇప్పుడు ఆశాజనకంగా పెరుగుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీటికి ఢోకా ఉండదని రైతులు చెబుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియాల్లో వర్షాలతో 40 నుంచి 60 మిల్లీమీటర్ల వరకు నీరు చేరగా.. మరోపక్క ఎగువన కురిసిన వర్షాలతో ఇన్‌ఫ్లో భారీగా వస్తోంది. దీంతో ఒక్కసారిగా జలాశయాల్లో నీటిమట్టాలు పైపైకి వచ్చాయి. రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ, తాండవ రిజర్వాయర్లలో జలకళ తాండవిస్తోంది. రైవాడకు 1010 క్యూసెక్కులు, పెద్దేరుకు 200, కోనాంకు 90, కల్యాణపులోవకు 50, తాండవకు 150 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఎగువ నుంచి వచ్చి చేరుతోంది. పెద్దేరు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని కాల్వ ద్వారా పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. మరో పక్క ఖరీఫ్ వరి నాట్ల కోసం రైవాడ కుడికాలువ (శారదానది) నుంచి 150 క్యూసెక్కులు, తాండవ రెండు కాల్వల నుంచి 550 క్యూసెక్కులు, కోనాం నుంచి 80 క్యూసెక్కులు నీటిని రైతుల కోసం ఇప్పటికే విడుదల చేస్తున్నారు. ఇక పాలగెడ్డ, గొర్లెగెడ్డ, ఉరకగెడ్డ, తారకరామ, గుండుబాడు మినీ రిజర్వాయర్లలో కూడా వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ల కింద సుమారు లక్ష ఎకరాల సాగు భూమి ఉండటంతో ఈ ఖరీఫ్ పంటలకు నీటి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జలాశయాల నీటిమట్టాలు

జలాశయం	గరిష్ట నీటిమట్టం	ప్రస్తుతం
పెద్దేరు	137 మీటర్లు	136.40 మీ
కల్యాణపులోవ	460 అడుగులు	448.8 అ
కోనాం	101.25 మీటర్లు	95.02 మీ
రైవాడ	114 మీటర్లు	109 మీ
తాండవ	380 మీటర్లు	363 మీ

జోరుగా వరి నాట్లు

బుధ, గురువారాల్లో కురిసిన కుండపోత వర్షాలతో పల్లపు ప్రాంత వరి పొలాల్లో భారీగా నీరు చేరింది. దీంతో మెరక ప్రాంతాల్లో వరి నాట్లు జోరుగా జరుగుతున్నాయి. పెద్దేరు జలాశయం ప్రధాన పంట కాలువలైన ఆర్ఎం, రాచకట్టు పరిధిలో రైతులు సుమారు 16 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఖరీఫ్ పంటలు చేతికి వస్తాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్యాచ్‌మెంట్ ఏరియాల్లో నీరు చేరడంతో ఖరీఫ్‌కు మేలు



జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతుండటంతో ఖరీఫ్ సాగుకు నీటి సమస్య ఉండదని భావిస్తున్నాం. ఇప్పటికే జలాశయాల కింద 92 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. మిగతా భూముల్లో కూడా నాట్లు వేస్తున్నారు. ఈ వర్షాలు చాలా మేలు చేశాయి. క్యాచ్‌మెంట్ ఏరియాలో నీరు చేరడంతో రానున్న రోజుల్లో జలాశయాల ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య ఉండదు. రైతులు నీటిని పూర్తిస్థాయిలో సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి.

–బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

రెండు రోజుల్లో అధిక వర్షపాతం

తుమ్మపాల: గత రెండు రోజులుగా కుంభవృష్టి కురవడంతో అధిక వర్షపాతాలు నమోదయ్యాయి. గురువారం ఒక్కరోజే 881.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వాగులు, వంకల మీదుగా నీరు ప్రవహించి చెరువులు వర్షపునీటితో నిండుగా కనిపిస్తున్నాయి. రోజంతా వర్షం కురుస్తుండటంతో రోడ్లపై జనజీవనం స్తంభించింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవరాపల్లి మండలంలో అత్యధిక వర్షపాతం 108.6 మిమీ కాగా, అత్యల్ప వర్షపాతం పాయకరావుపేటలో 2.2 మిమీగా నమోదైంది. సగటు వర్షపాతం 36.7 మిల్లీమీటర్లు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)	మండలం	వర్షపాతం (మి.మీ.లలో)
దేవరాపల్లి	108.6	మునగపాక	30.2
గొలుగొండ	78.2	రోలుగుంట	29.2
నాతవరం	77.2	సబ్బవరం	27.2
బుచ్చెయ్యపేట	73.6	కశింకోట	25.2
చోడవరం	54.6	పరవాడ	22.2
నర్సీపట్నం	42.4	కోటవురట్ల	21.8
అనకాపల్లి	41.2	మాకవరపాలెం	21.8
యలమంచిలి	41.2	మాడుగుల	19.4
అచ్యుతాపురం	34.2	నక్కపల్లి	19.4
రాంబిల్లి	32.4	కె.కోటపాడు	18.6
చీడికాడ	32.0	ఎస్.రాయవరం	15.6
		రావికమతం	12.8

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

- పనులు ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్
- రూ.13 కోట్లతో ఆలయ ఆధునికీకరణ





అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం శ్రీకారం చుట్టారు. ఏపీ అర్చక సంఘం ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో పనుల ప్రారంభ సూచనగా కలశ పూజ, గోపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం బాలాలయంలో తాత్కాలికంగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, హిమగౌరి దంపతులు బాలాలయంలో అమ్మవారికి తొలి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి 8 దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల భక్తులు పెద్ద ఎత్తున నూకాంబిక అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆలయ గర్భాలయాన్ని విస్తరించడంతోపాటు, ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు సమకూర్చిందని, టీటీడీ దేవస్థానం నుంచి రూ.3 కోట్లను అప్పటి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మంజూరు చేశారని, తొలివిడతగా రూ.కోటి 50 వేల నిధులు విడుదల చేశారన్నారు. అమ్మవారి ప్రధాన గర్భాలయాన్ని మూసివేసి, కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో భక్తుల దర్శనార్థం అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించినట్లు చెప్పారు. ఇక్కడి నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ మంత్రి దంపతులకు పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, బుద్ధ నర్సింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, మళ్లవరపు ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ప్రజలకు పౌష్టికాహారం అంది, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష, పోషణ్ అభియాన్, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాలపై ఆయన సమీక్ష జరిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, కాలానుగుణంగా తగిన ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వడం, అనారోగ్య సమస్యలకు సత్వర చికిత్సలు అందించడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ అన్నారు. ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమం, విద్యా శాఖలు సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్దేశించిన విధంగా అమలు చేయాలన్నారు. ఆరోగ్యంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. కీటక జనిత వ్యాధులపై కూడా సూచనలు చేయాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుం



అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన బాలకృష్ణుడిని ఉంచి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాకలోని గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు భాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో యశోదాదేవి ఒడిలో శ్రీకృష్ణ పరమాత్మ ఉగ్గుపాలు తాగే ఘట్టం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గోపూజ జరిపారు. అనంతరం ఆలయంలో గల అలంకరణ మూర్తులు, ఉత్సవ మూర్తులకు ధూపహారతి, చంద్రహారతి, గరుడ హారతి, నక్షత్ర హారతి, వనమాల హారతి, గజహారతి, కుంభ హారతి, పేట హారతులతో ప్రత్యేకంగా హారతి సమర్పణ నిర్వహించారు. ప్రత్యేక ఆరాధనలు పూర్తి చేసి అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. వెన్న, పాలు, పెరుగు తదితర విశేష నివేదనలు సమర్పించారు. కొండపై గల మూలవిరాట్‌కు రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమం జరిగింది. శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను రాజాదిరాజ వాహనంలో అధిష్ఠింపజేసి ఆలయ ప్రాంగణంలో ఉట్ల సంబరం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసపాటి శేషాచార్యులు, ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు, ఇల్లింద గోపాలాచార్యులు, నండూరు అప్పలాచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో..



ఉపమాకలో యశోదాదేవి అలంకరణ

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుక కన్నులపండువగా జరిగింది. బాలకృష్ణుడికి బేడామండపంలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహించనున్నారు.

శ్రీకృష్ణుడికి మహాభిషేకం

బీచ్‌రోడ్డు: హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం రాత్రి 9.30 గంటలకు శ్రీకృష్ణుడికి మహా అభిషేకం నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ ఉత్సవంలో భాగంగా బాలగోపాలుడికి మృదువైన ఉయ్యాలలో సేవ నిర్వహించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఉయ్యాల సేవలో పాల్గొన్నారు.

ఐటీఐలలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

నర్సీపట్నం: జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్ ప్రింట్ తీసుకొని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో దగ్గర్లో ఉన్న ఐటీఐ కళాశాలలో హాజరు కావాలన్నారు.

26 నుంచి దివ్యాంగుల సహాయ ఉపకరణ శిబిరాలు

తుమ్మపాల : ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేపట్టే సహాయ ఉపకరణాల శిబిరాలు వారికి అద్భుత అవకాశం అని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక వివేకానంద హాలులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వికలాంగుల సంక్షేమంలో భాగంగా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీమ్‌కో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించాలని కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామిని కోరిన వెంటనే ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఉపకరణాలుగా మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంకకర్రలు, కృత్రిమ కాళ్లు, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్ అందిస్తామన్నారు.

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్ మాట్లాడుతూ ఉపకరణాల సహాయ శిబిరాలకు దరఖాస్తు చేసుకునే దివ్యాంగులు అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. శిబిరాలు నిర్వహించే ప్రదేశం, తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు.

నడి సంద్రంలో.. ప్రాణాలు అరచేతిలో

- సముద్రంలో చిక్కుకున్న తమిళనాడు జాలర్లు
- ఆరు రోజుల పాటు నరకయాతన
- తీరానికి సురక్షితంగా తీసుకొచ్చిన కోస్ట్‌గార్డ్స్



కోస్ట్ గార్డు అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్న తమిళనాడు మత్స్యకారులు

మహారాణిపేట (విశాఖ): నడి సంద్రంలో తమిళనాడుకు చెందిన మత్స్యకారులు చిక్కుకుని నరకయాతన అనుభవించారు. ఆరు రోజుల పాటు తినడానికి తిండి లేక, తాగడానికి మంచి నీరు లేక అల్లాడిపోయారు. ప్రాణాలు అరచేత పట్టుకుని.. నీడలా వెంటాడిన మృత్యువుతో పోరాడారు. ఇండియన్ కోస్టగార్డు సాయంతో సురక్షితంగా తీరానికి చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన గణపతి పెరుమాళ్ బోటు ఆగస్టు 24న కాసిమేడు నౌకాశ్రయం నుంచి చేపల వేటకు బయలుదేరింది. చెన్నైకి నార్త్ ఈస్ట్ నుంచి 240 మైళ్ల దూరంలో వేట చేస్తుండగా.. ఈ నెల ఒకటో తేదీన మరమ్మతులకు గురైంది. ఈ బోటులో వేటకు వెళ్లిన 10 మంది మత్స్యకారులు నడిసంద్రంలో చిక్కుకుని నరకయాతన అనుభవించారు. సమాచారం అందుకున్న తమిళనాడు మత్స్యశాఖ అధికారులు కోస్ట్‌గార్డ్‌ను సంప్రదించారు. దీంతో ఆయూష్ నౌక రంగంలోకి దిగింది. తమిళనాడు మత్స్యకారులను విశాఖ తీసుకొచ్చి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకు అప్పగించారు. ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్‌లో బోటు మరమ్మతులు జరుగుతున్నాయి.

తీవ్ర ఇబ్బందులు పడ్డాం

బోటు మరమ్మతులకు గురి కావడంతో నడి సంద్రంలో చిక్కుకున్నాం. ఆరు రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. నా భార్య, పిల్లలను మళ్లీ చూస్తానని అనుకోలేదు. దేవుడి దయ వల్ల తీరానికి చేరాం. మమ్మల్ని ప్రాణాలతో రక్షించిన అధికారులకు కృతజ్ఞతలు.

–ఎం.శరవణన్, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

ఆరు రోజులు.. నరకయాతన

ఎన్నో ఏళ్లుగా సముద్రంలో వేట చేస్తూ.. జీవనం సాగిస్తున్నాను. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. తినడానికి తిండి లేదు.. తాగడానికి నీరు లేదు.. కంటి నిండా కునుకు లేదు. ఎప్పుడు ఒడ్డుకు చేరుతామా అని ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఆరు రోజుల పాటు గడిపాం. ఎవరు సాయం చేస్తారా అని ఎదురుచూశాం. కోస్ట్ గార్డ్ సిబ్బందికి ధన్యవాదాలు. చాలా సంతోషంగా ఇంటికి వెళుతున్నాను.

– ఎస్.రాజు, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

ఒడ్డుకు చేరుతామన్న నమ్మకం పోయింది

సముద్రం మీద ఆధారపడి నా కుటుంబం బతుకుతోంది. గతంలో సముద్రంలో వేట చేస్తున్న సమయంలో బోటు మరమ్మతులకు గురైంది. రిపేర్ చేసి ఒడ్డుకు చేరాం. ఈ సారి కూడా బోటుకు మరమ్మతులకు చేసేందుకు ప్రయత్నించినా.. సాధ్యం కాలేదు. అలల తాకిడి ఉధృతంగా ఉంది. పరిస్థితి మా చేయి దాటిపోయింది. ఒడ్డుకు చేరుతామన్న నమ్మకం కూడా సన్నగిల్లింది. జీవితం మీద ఆశలు వదులుకున్నాం. కానీ దేవుడు దయతో ఒడ్డుకు చేరాం. మమ్మల్ని రక్షించిన అధికారుల మేలు మరువం.

–రవికుమార్, కాసిమేడు ఫిషింగ్ హార్బర్, తమిళనాడు

క్లుప్తంగా

ఎంటెక్, ఎం.ప్లానింగ్ ఈవెనింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంటెక్, ఎం.ప్లానింగ్ సాయంకాలం కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. స్థానికంగా ఉద్యోగం చేస్తున్న వారికి ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంటెక్ కెమికల్ ఇంజినీరింగ్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్ డ్రైవర్స్ అండ్ కంట్రోల్స్, రాడార్–మైక్రోవేవ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, క్యాడ్–క్యామ్, థర్మల్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎం.ప్లానింగ్(ఎన్విరాన్‌మెంటల్) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు www.audoa.in సందర్శించవచ్చు.

9న జాతీయ సమాచార కమిషనర్ల సమాఖ్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్స్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎఫ్‌ఐసీఐ) జాతీయ సదస్సు విశాఖ నగరంలో జరగనుంది. ఈ నెల 9న జరగబోయే 28వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, 12వ వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా కేంద్ర సమాచార కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వైకే సిన్హా, సీఐసీ ఇన్ఫర్మేషన్ మిషనర్ సురేష్ చంద్ర హాజరుకానున్నారు. ఏపీ ఇన్ఫర్మేషన్ కమిషన్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్.మహబూబ్ భాషా శుక్రవారం విశాఖ చేరుకోనున్నారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించనున్నారు. ఏపీ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు చెల్లించాలి

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒకసారి తప్పిన వారికి 2024 ఏప్రిల్‌లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతికి ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు, ఇంటర్మీడియట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.150లు, ప్రాక్టికల్ ఒక్కో సబ్జెక్టుకు రూ.100లు ఫీజు అక్టోబర్ 15లోగా ఫీజు చెల్లించాలన్నారు. ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్‌కు కూడా అవకాశం ఉందని, పూర్తి వివరాల కోసం స్టడీ సెంటర్లలో సంప్రదించాలన్నారు.

విస్తరణకు చకచకా అడుగులు

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ. దశాబ్దాలుగా స్థానికుల కల. గత ప్రభుత్వాలు హామీతో సరిపెట్టిన రోడ్డు విస్తరణను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చొరవతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. భవన యజమానులు కూడా ప్రభుత్వ సంకల్పానికి మద్దతుగా నిలిచారు. తాజాగా ఆర్డీవోను భూసేకరణ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ఇక ఊపందుకోనున్నాయి.


విస్తరించనున్న మెయిన్ రోడ్డు

- భూ సేకరణకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- ఆర్డీవో జయరాంకు భూ సేకరణ బాధ్యతలు

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు చకచకా అడుగులు పడుతున్నాయి. రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. భూసేకరణ అధికారిగా నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాంను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భవన యజమానులను ఒప్పించి రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సంకల్పించారు. దీంతో ఎక్కువ శాతం మంది భవన యజమానులు బదిలీకి వీలున్న హక్కు పత్రాలు(టీడీఆర్ బాండ్లు) తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు నిభ్యంతర ధ్రువీకరణ పత్రాలను కూడా అందించారు. కొంత మంది యజమానులు టీడీఆర్ బాండ్లు వద్దని, నష్ట పరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు. భవన యజమానులు కోరిన విధంగా అలాంటి వారికి నష్ట పరిహారం చెల్లించి, భూ సేకరణ జరిపేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

మెయిన్ రోడ్డుతోపాటు లింక్ రోడ్డు నిర్మాణం

గత ఏడాది డిసెంబర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెయిన్ రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. స్థానికుల కోరిక మేరకు మెయిన్ రోడ్డుతో పాటు మరో లింకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు 107 మంది భవన యజమానులు టీడీఆర్ బాండ్లు తీసుకునేందుకు అంగీకరించారు. ప్రభుత్వ భవనాలతో పాటు స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వారి భవనాల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. వీరిలో కొంత మంది కోర్టును ఆశ్రయించారు. ఇది భవనాల తొలగింపునకు అడ్డంకిగా మారడంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ల్యాండ్ అక్విజిషన్ ద్వారా రోడ్డు విస్తరణ చేసేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ ల్యాండ్ అక్విజిషన్ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ల్యాండ్ అక్విజిషన్‌తో రోడ్డు విస్తరణకు చకచక అడుగులు పడనున్నాయి.

త్వరితగతిన రోడ్డు విస్తరణ



మెయిన్ రోడ్డు విస్తరణకు మెజార్టీ భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కొందరు కోర్టును ఆశ్రయించారు. వారు కోరిన విధంగానే ల్యాండ్ అక్విజిషన్ ద్వారా నష్టపరిహారం చెల్లిస్తాం. భవన యజమానుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ల్యాండ్ అక్విజిషన్‌కు ఆదేశాలు వచ్చాయి. అందరి కోరిక మేరకు వీలైనంత వేగంగా రోడ్డు విస్తరణను పూర్తి చేస్తాం.

పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

కొడుకు మృతిపై అనుమానం

- నెల రోజుల తర్వాత శవాన్ని వెలికితీత

అచ్యుతాపురం(అనకాపల్లి): తన కుమారుని మృతిపై అనుమానం ఉందని పూడి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన మహిళ పెదపాటి నాగరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం పోలీసులు గురువారం పాన్పు చేసిన శవాన్ని సీఐ గఫూర్ ఆధ్వర్యంలో వెలికితీశారు. పోస్టు మార్టం కోసం శవాన్ని ఆస్పత్రికి తరలించారు. గత నెల 2న ఇంటి నుంచి వెళ్లిన నూకరత్నం కుమారుడు సత్తిబాబు(28) మరుసటి రోజు తెల్లవారు జామున వారి ఇంటి మెట్ల పైనే మరణించి ఉండటాన్ని గుర్తించారు. తొలుత కుటుంబీకులు సహజ మరణంగా భావించి స్థానికుల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే మృతుని తల్లి, కొడుకు మరణం పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ దర్యాప్తు చేయాలని అచ్యుతాపురం పోలీసులను ఇటీవల కోరారు. దీంతో వాస్తవాలను తేల్చేందుకు శవాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం ఇతర వైద్య పరీక్షలు చేసి సహజ మరణమా, మరే ఇతర కారణాలు ఉన్నాయా..? అన్నది పోలీసులు విచారణ జరిపి, తేల్చనున్నారు.


శవాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

తానా కవి సమ్మేళనానికి శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: తానా అంతర్జాతీయ అంతర్జాల కవి సమ్మేళనానికి ప్రత్యేక అతిథిగా కాదంబరి శ్రీనివాస్‌కు ఆహ్వానం అందినట్లు సాహిత్య వేదిక నిర్వాహకులు చిగురుమళ్ల శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణా భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ సమ్మేళనానికి అనకాపల్లి జిల్లా, తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆన్‌లైన్, యూట్యూబ్ చానెళ్ల ద్వారా ప్రసారం అవుతుందన్నారు. గుర్రాజుపేట పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న శ్రీనివాసరావును తానా కవి సమ్మేళనానికి ఆహ్వానించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

మత్స్యకారులకు రాయితీ డీజిల్ పంపిణీ


పూడిమడకలో పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

- బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే
- కొత్త పింఛన్లు పంపిణీ

అచ్యుతాపురం (అనకాపల్లి): సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి రాజీ పడని నేత సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో మత్స్యకారులకు లీటర్ డీజిల్ రూ. 9 రాయితీతో అందించే బంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. మత్స్యకార భరోసా పథకం కింద గుర్తింపు పొందిన మత్స్యకారులకు ఈ డీజిల్ అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మత్స్యకారులకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 450 పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, జేసీఎస్ సచివాలయాల కన్వీనర్ రాజాన విజయ్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, అడిగర్ల దేముడు, కూండ్రపు విమలనాయుడు, పిన్నమరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ స్టోర్ యజమానిపై దాడి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల కేంద్రంలో ఆగంతుకుడు డిపార్టుమెంటల్ స్టోర్‌లో ప్రవేశించి కలకలం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు. పూడిమడక రోడ్డులో ఉన్న స్టోర్‌లోకి బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక అపరిచిత వ్యక్తి ప్రవేశించాడు. ఆ సమయంలో యజమాని ఒకరే ఉన్నారు.

ఆగంతకుడు సరకులు కావాలని కోరడంతో యజమాని లోపలికి వెళ్లాడు. ఆ సమయంలో క్యాష్ కౌంటర్‌లో చేయి పెట్టినట్లుగా సీసీ కెమెరాలో రికార్డు అయింది. వెంటనే యజమాని ద్వారపురెడ్డి రాజులు అతడ్ని మందలించే ప్రయత్నం చేయగా, యజమానిపై దాడి చేశాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయినప్పటికీ ఆగంతుకుడు స్పష్టంగా కనబడలేదు. స్టోర్‌లోకి వచ్చి, దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా రాజులు అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

జమీలు ఆశయ సాధనకు కృషి

- విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నాతవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దివంగత నేత అంకంరెడ్డి జమీలు ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండల కేంద్రంలో జమీలు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక విభాగం క్రియేటివ్ హెడ్ లోకవరపు జోగినాయుడుతో కలిసి, ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి జమీలు విశేష కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో నాతవరం పంచాయతీలో రూ.కోట్ల నిధులతో సచివాలయాలు, ఆర్బీకేలు, పశు వైద్యశాలల నూతన భవనాలను నిర్మించినట్లు తెలిపారు. భారీ వర్షంలో సైతం పండగ వాతావరణాన్ని తలపించేలా జమీలు విగ్రహ ఆవిష్కరణ చేయడం చూస్తే ఈ ప్రాంత ప్రజలకు ఆయనపై ఎంత అభిమానం ఉందో తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చిటికిల భాస్కరనాయుడు, ఎంపీపీలు జెడ్పీటీసీ సభ్యులు సాగిన లక్ష్మణమూర్తి, రుత్తల సత్యనారాయణ, సుర్ల రాజేశ్వరి, గజ్జెలపు మణికుమారి, సుర్ల గిరిబాబు, పెట్ల భద్రాచలం, నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు లగుడు నాగేశ్వరరావు, లెక్కల సత్యనారాయణ, సుర్ల సత్యనారాయణ రుత్తల వాసు, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పైల పోతురాజు శిరుసుపల్లి నర్సింగరావు, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, జమీలు కుటుంబ సభ్యులు, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ అంకంరెడ్డి పార్వతి, వైద్యాధికారి అంకంరెడ్డి సౌమ్య, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


జమీలు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, జోగినాయుడు

10న అమెరికాలో పుస్తకావిష్కరణ

అనకాపల్లి టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శిష్టా తమ్మిరాజు రచించిన వేంకటేశ్వర శతక పుస్తకం 'దాస తమ్మిరాజు దండ మిదియె'ను ఈ నెల 10న ఆవిష్కరించనున్నట్లు సాహితీ మిత్రులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆయన తన కుమారుడి వద్ద అమెరికాలో ఉంటున్నారు. దీంతో ఆ రోజు అమెరికాలోని ఫ్లోరిడా రాజధాని తల్లాహస్సీ నగరంలో దీన్ని ఆవిష్కరించనున్నారు. ఈ పుస్తకాన్ని తల్లాహస్సీ తెలుగు సాహిత్యోత్సవాల సందర్భంగా ఆవిష్కరిస్తున్నట్లు మిత్రులు పేర్కొన్నారు.

వినాయక ఘాట్ నిర్మాణానికి హామీ

అనకాపల్లిటౌన్: స్థానిక శారదానది వద్ద వినాయక ఘాట్ నిర్మాణానికి అవసరమైన నిధులు రూ.50 లక్షలు మంజూరు చేసేందుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చినట్లు వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి గురువారం తెలిపారు. పట్టణంలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రిని నిమజ్జనోత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సామూహిక చవితి వేడుకలకు సహకరించాల్సిందిగా కోరారు. ఘాట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు అవసరమైన నిధుల్ని సర్దుబాటు చేయాల్సిందిగా జీవీఎంసీ అధికారులను మంత్రి సూచించారు. మంత్రిని కలిసిన వారిలో కమిటీ సభ్యులు తాటికొండ శ్రీకాంత్, పెంటకోట వరప్రసాద్, ఉగ్గిన శ్రీను, అల్లు త్రినాథ్, కోట నాగేష్, ఆడారి శ్రీను, మళ్ల భోగలింగం, పిళ్లా రాజు పాల్గొన్నారు.


మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ సభ్యులు

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి

- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

డాబాగార్డెన్స్: కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌కు అహర్నిశలు కృషి చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కె.గోవిందరావు, సీహెచ్ సూరిబాబు, డాక్టర్ ఎస్‌కే కాసిం తదితరులు పాల్గొన్నారు.

మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాటం

సీతంపేట: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తి ఎన్నికైనట్టు కేంద్ర కమిటీ కన్వీనర్ ఆర్‌ఎస్‌వీ మురళి తెలిపారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందన్నారు. 1972లో ఏర్పడ్డ సమాజం, 50 ఏళ్లకు పైగా మానవ హక్కులు కోసం, స్త్రీవివక్షకు వ్యతిరేకంగా, దేవుడి పేరుతో జరిగే దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సభ్యులుగా జె.శ్యామల, వీరబాబు, కె.విజయ్‌కుమార్, మధుసూదన్, జి.వికాస్, శ్రీరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

వచ్చే నెల 1న శతాబ్ది హాఫ్ మారథాన్

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబర్ ఒకటో తేదీన శతాబ్ది హాఫ్ మారథాన్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు గురువారం ఆవిష్కరించారు. ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి ఆ రోజు ఉదయం 3 కి.మీ, 5 కి.మీ, 10 కి.మీ శతాబ్ది హాఫ్ మారథాన్ ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, వైద్యులు గోపాలరావు, సిహెచ్‌ఆర్‌విఎన్ భూషణ్‌రావు, జి.శ్వేతారావు, ఎంఎస్ఎన్ పాత్రుడు, ఎ.హర్షిత, విజిఎస్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, చిత్రంలో పలువురు వైద్యులు

నేడు శ్రీవారి సన్నిధిలో లడ్డు విక్రయాలు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ శనివారం లడ్డు విక్రయాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. 750 గ్రాములు ఉన్న కల్యాణ లడ్డు రూ.200, 140 నుంచి 170 గ్రాములు బరువు ఉన్న సాధారణ లడ్డు రూ.50 విక్రయిస్తామని పేర్కొన్నారు.

సచివాలయాల్లో సకాలంలో సేవలు

- రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రావత్
- సిబ్బందికి ఆదేశం

మారేడుమిల్లి : ఏజెన్సీలోని గ్రామ సచివాలయాల ద్వారా సకాలంలో ప్రజలకు సేవలు అందించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. సున్నంపాడు గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో గిరిజనులు పథకాలకు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. బోధన తీరును పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూజారి పాకలు గ్రామంలోని రబ్బర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అక్కడి రబ్బర్ రైతులతో మాట్లాడారు. రబ్బర్ ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. ఏజెన్సీలో రబ్బర్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆర్థికశాఖ ఆర్‌ఎంఅండ్‌ఎఫ్‌పీసీటీఎస్ గుల్జార్, రాష్ట్ర ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి. సునిల్ కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎఫ్‌వో జీజీ నరేంద్ర, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి చిట్టిబాబు, ఎంపీడీవో జయంతి, డీడీ బాలాజీ పాల్గొన్నారు.


పూజారి పాకలులో రబ్బర్ రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రావత్

రంపచోడవరం ఐటీడీఏలో సమీక్ష

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన గిరిజనులందరికి అందజేసే బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ఆర్ఎంఎఫ్‌పీసీటీ కార్యదర్శి యస్. గుల్జార్, ఆర్థిక శాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ధికారి బి. సునిల్ కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సల్, డీఎఫ్‌వో నరేంద్రన్ సమీక్షలో పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నాలుగేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి అటవీ అభ్యంతరాలపై అధికారులతో చర్చించారు. గిరిజన సహకార సంస్థ పనితీరుపై సమీక్షించారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రతీ నెల ఏజెన్సీ ఆసుపత్రుల్లో కనీసం 20 ప్రసవాలు జరగాలన్నారు. ప్రతీ గ్రామానికి విద్యుత్ సదుపాయం ఉండాలని, ఇంకావిద్యుత్ లేని గ్రామాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల అభివృద్ధి కొరకు తయారు చేసిన ప్రణాళిక వివారాలు తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ప్రమాదాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఓ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు, అగ్ని, నీరు, గ్యాస్ తదితర ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన మెళకువలపై డెమో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి రాజేశ్వరరావు, లీడింగ్ ఫైర్‌మన్ శ్రీను, ఫైర్‌మన్‌లు మణికుమార్, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

మరింత తగ్గిన టమాటా



కశింకోటలో వారపు సంత

కశింకోట: కశింకోటలోని వారపు సంతలో గురువారం టమాటా ధర మరింత తగ్గింది. కిలో రూ.30 నుంచి రూ.20కి తగ్గింది. అయితే నాణ్యమైనది రూ.30కి విక్రయాలు సాగాయి. క్యాప్సికం రూ.వంద నుంచి రూ.80కి తగ్గింది. బంగాళాదుంప రూ.20, ఉల్లిపాయ రూ.30, బీన్స్, వంకాయ, బెండకాయ రూ.40, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా పూలు, పండ్లు, పూజా ద్రవ్యాలు వగైరా అమ్మకాలు ఎక్కువగా సాగాయి. వర్షం కురవడం వల్ల కొంతమేర సంత ప్రాంతం చిత్తడిగా మారింది.

13న మండల సమావేశం

అనకాపల్లి రూరల్ : ఈ నెల 13వ తేదీన అనకాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.వి. నరసింహారావు మీడియాకు తెలిపారు. ఎంపీపీ ఆదేశాల మేరకు 9వ సమావేశం షెడ్యూలు ఖరారు చేశామన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. మండలంలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమావేశం వివరాలు, అజెండా పంపించామని ఎంపీడీవో తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 146 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,280	4,290
రెండో రకం	4,200	4,230
మూడోరకం	4,150	4,150

అనకాపల్లి సినిమాలు

ద నన్	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	: షిర్డిసాయి
జవాన్	:పర్తిసాయి
జవాన్	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 82 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 401 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నూకాంబిక-ఫూల్‌బాగ్ రహదారికి
మహర్దశ



రహదారి పక్కనున్న గృహానికి మార్కింగ్ వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- 2.2 కిలోమీటర్ల పొడవు 60 అడుగుల వెడల్పు
- రూ.2 కోట్లతో రహదారి విస్తరణ

అనకాపల్లిటౌన్ : నూకాంబిక- ఫూల్‌బాగ్ రహదారికి మోక్షం లభించింది. ఇక్కడి అమ్మవారి ఆలయానికి ప్రతి ఏటా నెలరోజులపాటు జరిగే జాతరకు 50వేలకుపైగా భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత పెద్దసంఖ్యలో వచ్చే భక్తులు ఈ రహదారిలో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆలయాన్ని రూ.10 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్నారు. ఇటు అమ్మవారి ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర, అటు జిల్లా కేంద్రంగా ఆవిర్భావంతో అమ్మవారి ఆలయ రహదారి మరింత ప్రాముఖ్యం సంతరించుకుంది. ఈ ఈనేపథ్యంలో ఆలయ రహదారి విస్తరించాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిశ్చయించారు.

ఆ నెలరోజులు రహదారులు కిట కిట..

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాంతి గాంచిన నూకాంబిక అమ్మవారి ఆలయానికి రాష్ట్రంతో పాటు పలు జిల్లాల నుంచి వచ్చే భక్తులతో రహదారులు నెలరోజుల పాటు కిట కిటలాడతాయి. ప్రతి ఏడాది కొత్త అమావాస్య నుంచి గంధామావాస్య వరకు నెలరోజుల పాటు జరిగే జాతరకు ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆ నెలరోజుల పాటు ఆలయానికి 50 వేలకు పైగా భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. భక్తుల రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి.



ప్రస్తుత నూకాంబిక రహదారి

రహదారి విస్తరణకు మార్కింగ్ పనులు

అమ్మవారికి ఆలయానికి చేరుకోవడానికి జాతీయ రహదారిలో అమ్మవారి ఆర్చి ద్వారా శ్మశానవాటిక, సంతబయలగుండా అమ్మవారు చేరుకోవచ్చు. స్థానికంగా ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి ఫూల్‌బాగ్ రహదారి మరొకటి ఉంది. ఈ రహదారి విస్తరణ చాలక ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులపై దృష్టి సారించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికే రహదారి విస్తరణకు సంబంధించి మార్కింగ్ పనులు చేపట్టారు. రహదారి విస్తరణ పూర్తయిన వెంటనే డ్రైనేజీ వ్యవస్థ, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు.

వారం రోజుల్లో గృహ, దుకాణ సముదాయాలు తొలగింపు

మరో వారంరోజుల్లో ఈ రహదారి పొడవునా ఉన్న గృహ, దుకాణ సముదాయాలను తొలగించేలా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ రహదారి విస్తరణలో భవన యజమానులు 210 మంది ఉన్నారు. వీరికి మార్కెట్ ధర ప్రకారం రూ.2 కోట్లు చెల్లింపులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వీరికి స్థలాన్ని బట్టి ధర నిర్ణయించాల్సి ఉంటుందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఆరు మాసాల్లో రహదారి అందంగా..



వచ్చే ఏడాది మార్చి నాటికి రహదారిని విస్తరించి అందంగా తీర్చిదిద్దుతాం. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రజల సహకారంతో రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే మార్కింగ్ పనులు చేపట్టాం. రహదారి విస్తరణలో భవనాలు కోల్పోయిన వారికి మార్కెట్ ధర ప్రకారం రూ.2 కోట్లు ఇవ్వనున్నాం.

-ఎం.పి.జనార్దనరావు, జీవీఎంసీ ఇన్‌ఛార్జి ఏసీపీ

జోరు వానలోనూ
'గడప గడపకు'

- మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



లబ్ధిదారులకు సంక్షేమ పుస్తకాలను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



టీడీపీని విడిచి వైఎస్సార్‌సీపీలో చేరిన వ్యక్తులకు పార్టీ కండువా వేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : పేదలకు ప్రభుత్వ పథకాలను నిర్విఘ్నంగా అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అర్హులైన లబ్ధిదారులకు ఈ ఏడాది దసరా నాటికి టిడ్కో గృహాలను అందజేస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక గాంధీనగరం రామాలయం వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల పుస్తకాలను అందజేస్తూ, వారి వారి సమస్యలను తెలుసుకుంటూ మంత్రి అమర్‌నాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగరంలో స్థానిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పట్టణాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామని చెప్పారు. గత ప్రభుత్వాలు పట్టణాన్ని అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, దశల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మండలంలో ఆటోనగర్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లాలో నిరుద్యోగులకు 75శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువస్తే, పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు. అంతకు ముందు గాంధీనగరం మాజీ మున్సిపాల్ కౌన్సిలర్ కొండూరు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో 10 మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరగా మంత్రి అమర్‌నాథ్ పార్టీ కండువాను వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మునూరు శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేటలో 'గడప గడపకు' నేడు

స్థానిక విజయరామరాజుపేట సచివాలయం 2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, స్థానిక పార్టీ శ్రేణులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

రూ.1.52 కోట్లతో అభివృద్ధి పనులు

అనకాపల్లిటౌన్ : అభివృద్ధి, సంక్షేమం రెండు నేత్రాలుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, దశల వారీగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగరంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, చోడవరం రహదారి అభివృద్ధి పనులకు గురువారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కావాలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మొదటి దశలో ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నా యన్నారు. నెహ్రూచౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకూ తారు రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధిలో స్థానిక ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, రహదారి అభివృద్ధి పనులు రూ.కోటి 52లక్షల నిధులతో చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, 83వ వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, జీవీఎంసీ కమీషనర్ వెంకటరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

17న వాసవీ క్లబ్‌ల సమావేశం



వాసవీ క్లబ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న టి.శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సహాయంగా అందించాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎంవీఏ హాల్లో వాసవీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకూ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 17వ తేదీన పట్టణంలో అన్ని వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బి.మంగరాజు, కోశాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా రైతులకు విస్తృత సేవలు

తుమ్మపాల : రైతే రాజు అన్న మాటను నిజం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. పట్టణంలో వివేకానంద ఫంక్షన్ హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం హార్టికల్చర్ సైంటిస్టులు, ఎఫ్‌పీవో సభ్యులు, అధికారుల అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందించేలా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. వ్యవసాయంలో వర్షభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటల సాగు వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, ఎస్పీడీఎస్ కార్యదర్శి కర్రి జోగునాయుడు, శివకుమార్, బీసీటీ కె.శైలజ పాల్గొన్నారు.



ఉద్యానశాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

పంట కాలువలో పూడిక తొలగింపు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెర్లోపల్లి కాలువలో పూడిక తొలగింపు పనులను గురువారం సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు ప్రారంభించారు. ఈ కాలువలో చెత్త చెదారంతో పాటుగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి సాగునీరు ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో వ్యర్థాల తొలగింపు చేపట్టాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. పొక్లెయిన్‌తో కాలువలో వ్యర్థాలను తీసి ట్రాక్టర్లతో పంచాయతీ డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రస్తుతం అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. పంట కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పొలాలకు సాగునీరు చేరడంలేదు. దీంతో సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యర్థాల తొలగింపును యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, వార్డు సభ్యులు బోయిన నాగరాజు, సత్యారావు, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతెన శ్రీను, బొడ్డపాటి గణేష్, బంగారు రేవంత్, యాతపేత వీధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పర్యవేక్షించారు.



చెర్లోపల్లి కాలువలో సిల్టు తొలగింపును పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు, వార్డు సభ్యులు

పచ్చగా వరి పొలాలు



పచ్చదనంతో దర్శనమిస్తున్న వరి నాట్లు

కశింకోట : మండలంలోని గొబ్బూరు గ్రామం వద్ద వరి పొలాలు పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి. బోర్లు, వర్షపు నీరు, గెడ్డ కాలువ నీటితో ఖరీఫ్ వరి నాట్లు దాదాపు పూర్తి చేశారు. దీంతో వరి నాట్లు పచ్చదనంతో చూపరులకు కనువిందు చేస్తున్నాయి.

ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి నేడు కౌన్సెలింగ్

కశింకోట : కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగుల పిల్లల కోటా 50 శాతం సీట్లు భర్తీ చేయడానికి శుక్రవారం ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ శివ తెలిపారు. 4 బ్రాంచ్‌ల్లో ఉన్న 120 సీట్ల భర్తీకి పాలిసెట్ ర్యాంకుల ఆధారంగా కోటా సీట్లు భర్తీ చేస్తామన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు.

టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు శిక్షణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లిలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 60 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థలు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వై.కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎ.రాజశేఖర్, హరిపాలెం గ్రామ సర్పంచ్ భర్త ఎం.సూర్యనారాయణ, కె.ఎం నాయుడు, కె.ఆదీశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, పాండురంగారావు, శ్రీను, బుద్ధ సత్యరామ్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, తిమ్మరాజుపేట గ్రామాల్లో మరిడిమాంబ అమ్మవారి పండగలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నాగులాపల్లిలోని అమ్మవారిని ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రి అమర్‌నాథ్‌ను శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దొడ్డి వరహా సత్యనారాయణ, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, ఉప సర్పంచ్ దానకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఇల్లా నాగేశ్వరరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దుబాసి నాయుడు, మొల్లేటి శంకర్, సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పాల్గొన్నారు.

పలు చోట్ల చిరుజల్లులు

కశింకోట: కశింకోట ప్రాంతంలో గురువారం చిత్తడి వర్షం కురిసింది. ఉదయం నుంచి దాదాపు మధ్యాహ్నం వరకు జల్లులుగా వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షం ఎండిపోతున్న వరి నారుమళ్లు, నాటిన వరి పొలాలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



కృష్ణుడు గోపిక వేషధారణలో చిన్నారులు



చంద్రశేఖరరావు కల్యాణమండపంలో ఉట్టికొడుతున్న చిన్నారి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో హరేకృష్ణ సత్సంగ మందిరం ఆధ్వర్యంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం స్వామి తులసిపూజ, సంధ్యాహారతి, రాధాకృష్ణులకు పంచామృతాభిషేకం, సహస్ర కలశాభిషేకం, ఊంజల్ సేవలు కృష్ణప్రేమ్ దాస్ ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు చిన్నారులు గోపికలు, కృష్ణ వేషధారణలో అలరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. విజయరామరాజుపేట కృష్ణమందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరాం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువతో సత్కరించారు. ఆలయ కమిటీ, శారదాబాల గణపతి యూత్ కమిటీ సభ్యులు కోన రామకృష్ణ, చింతా రాంజీ, నాగేశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక కోనేరు వద్ద ఉన్న శ్రీకృష్ణ మందిరంలో వంశీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుని ఊరేగించి ఉట్లను కొట్టారు. సంతబయల వద్ద శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన, లలిత సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తి గీతాల ఆర్కెస్ట్రా నిర్వహించారు. సాయంత్రం చిన్నారులతో ఉట్టి కొట్టారు. బాణసంచా కాల్చారు. నిర్వాహకుడు కొణతాల లింగాజీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు

కశింకోట : కశింకోటలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్ని కృష్ణుని విగ్రహాన్ని అందంగా అలంకరించి ఊయలలో ఉంచి పాటలు పాడుతూ లాలించారు. పండ్లు, వివిధ రకాల ఆహార పదార్థాలు, స్వీట్లు నివేదించారు. అంతకుముందు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కశింకోటలోని కోనేరు వద్ద శ్రీకృష్ణ మందిరంలో కృష్ణుని దర్శించుకుంటున్న భక్తులు

12 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు మండలస్థాయి స్కూల్‌గేమ్స్ కన్వీనర్ ఎస్.వి.నరసింహం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 11, 17 విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా తొమ్మిది క్రీడాంశాల్లో ఈనెల 12, 13, 14, 15 తేదీల్లో పోటీలుంటాయని తెలిపారు. మండల స్థాయి టీంలను ఎంపిక చేయడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎస్‌జీఎఫ్ ఎలిజిబిలిటీ పత్రంతోపాటు ఎండీఎం ఎక్విటెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9247150037 సంప్రదించాలని కోరారు.